# విధి

మాదిరాజు లక్ష్మీనరసింహారావు

'సంక్రాంతి పండుగ యింకా మూడు రోజులుంది.'

క్రొత్తగా అత్తవారింటికి వెళ్ళిన కూతుర్ని, అల్లుడ్ని సంభావించు కోవాలని తప్పదు వెంకట్రావు మాష్టరుగారికి.

స్కూలుమాష్టరుగా యిరవై సంవత్సరాల నుంచి జీవితం గడుపుతున్న వెంకట్రావుగారికి పెద్ద సమస్య ఎదురయింది. ఎంద రిజీవితాలలో వెలుగుబాటచూపుతున్న వెంకట్రావు మాష్టరుగారికి తన చీకటిబాటలోని తడుముకోవలసి వస్తోంది దారి కనపడక. ఆయన మనసులో యెప్పుడూ తన పెద్ద సంసారం గురించే ఆలోచన.

అంతకు ముందే కూతురు వద్దనుండి వచ్చిన జాబును జేబులోంచి తీసి మరోకసారి మనసులో చదవసాగాడు వెంకట్రావు మాష్టరు గారు.

నాన్న గారికి !

మీ ప్రియమైన కుమార్తె సావిత్రి నమస్కరించి వ్రాయునది మీరు వ్రాసిన ఉత్తరం అందినది. పోయినసారి దసరా పండుగకు వచ్చినప్పుడు మీ అల్లుడికి రిష్టువాచీ కొని పెడతామని యింతవరకూ కొని పెట్టలేదట. రేపు సంక్రాంతిపండుగకు కొని పెట్టేట్లయితే వస్తామని వ్రాయమన్నారు. మీ కుటుంబ పరిస్థితి యెరిగికూడా నేను యీ విధంగా వ్రాస్తున్నందుకు క్షమించవలసినది. ల॥ సు॥ అమ్మగారికి నా నమస్కారములు. చి॥ పిల్లలకు నా ఆశీర్వాదములు.

ఇట్లు<br>
మీ ప్రియమైన<br>
సావిత్రి.

'సా....వి...త్రి...అని మనసులో ఒకసారి మననం చేసుకుని జేబులో పెట్టుకున్నాడు ఉత్తరాన్ని వెంకట్రావు మాష్టరు గారు.

పెద్దకుమార్తె సావిత్రి పెళ్ళిచేసి యింకా సంవత్సరం తిరగలేదు. సావిత్రి పెళ్ళికని వడ్డీల ధర్మయ్య దగ్గర తీసికువచ్చిన రెండువేల రూపాయలు అప్పు తీర్చనేలేదు. యిప్పుడు మళ్ళీ యిదొకటి.

కనీసం సుమారు మూడువందల రూపాయలైనా కావాలి. మూడువందలు.

వాచీ ఖరీదు సుమారు నూటయాభై రూపాయ లుంటుంది. అల్లుడికి కూతురికి బట్టలు పెట్టాలి.

ఖర్చు...ఖర్చు !

అంతా ఖర్చే !

యింకా ముగ్గురు చిన్నపిల్లలున్నారు. వారి గతేం అవుతుందో ?

యింటిలో వంటింట్లోనుంచి, వెంకట్రావు మాష్టరుగారి భార్య పార్వతమ్మ వసారాలోకి వచ్చింది.

'యేమండీ ! మీతో చెప్పటం మర్చిపోయాను మన అమ్మాయి పెళ్ళికి క్రొత్తదిద్దులు చేయిచ్చిద్దామనుకున్నాము. అప్పుడు తీరక చేయించలేదు. అప్పటినుంచి మనం చేయించనేలేదు. అమ్మాయి యేమనుకుంటుందో...' భర్త ముఖంచూసి మధ్యలోనే ఆపింది పార్వతమ్మ. భర్త మౌనంచూసి యేమి మాటాడాలో తెలియక తికమక పడ్డది. 'యేమండీ! వంట్లో బాగాలేదా ?'

'బాగానే వుంది లేవే!' అని విసుక్కుంటూ బయటకు నడిచాడు వెంకట్రావు మాష్టరు.

సాయంత్రం ఐదుగంట లయింది.

కాలువగట్టున చల్లగాలి వీస్తోంది. పొలాల నుంచి పశువులు యిళ్ళకు చేరుతున్నాయి.

ఆ ప్రశాంతమైన ఆహ్లాదకర వాతావరణం వెంకటరావు మాష్టరు మనస్సును శాంతిపరుచలేదు.

ప్రస్తుతం ఆయనకు డబ్బు కావాలి. ఒకటి కాదు...రెండు కాదు అక్షరాల మూడువందల రూపాయలు.

ఆయన బాధా నివారణకు డబ్బు కావాలి.

డబ్బు...డబ్బు.

వెంకటరావుగారి ఆలోచన మళ్లీ ధర్మయ్యను అప్పు అడుగుదామనే ! యింతకు ముందు తీసికొన్న అప్పే తీర్చలేదు మళ్ళీ యే ముఖంతో అడగటం ?

అడిగినా యిస్తాడని నమ్మక మేమిటి ?

అప్పు అడగక తప్పదు. అడగకపోతే ప్రస్తుత సమస్యలకు తరుణోపాయంలేదు.

బరువెక్కిన ఆలోచనలతో ఇంటికిచేరాడు. తెల్లవారింది.

బాల భాస్కరుని వేడి కిరణాలకు ప్రపంచం మేల్కొంది. తమ దినచర్యను ప్రారంభించారు మానవులు చౌదరిగారుకూడా తన పనికోసమై వెంకట్రావు మాష్టరు యింటికి బయలుదేరాడు.

పంతులుగారూ !

'ఆ ! యెవరూ ! చౌదరిగారా ! రండి ! రండి ! మీతో కొద్దిగా మాట్లాడాలి,' అంటూ వెంకట్రావుగారు చూపించిన కుర్చీలో కూర్చున్నాడు.

'...మీరు సంసార విషయంలో చాలా బాధ పడుతున్నారని తెలిసిందండీ ! మేమింత మందుండగా మీరు బాధ పడవలసిన అవసరం లేదండీ ! మీ కుపయోగించని మా డబ్బు వ్యర్థం' అంటూ జేబులోంచి రెండు నూరు రూపాయల నోట్లు తీశాడు.

డబ్బు దొరకక అవస్థపడుతున్న మాష్టరు గారి కళ్ళు ఆత్రంగా చూచాయి ఆ నోట్లని.

(తరువాయి 17 వ పేజీ)

## ★ విధి ★

(13 వ పేజి తరువాయి)

తీసుకోమన్నట్లు చూశాడు చౌదరి.

వెంకట్రావు మాష్టరుగారి మనసులో యేదో మెదిలింది. మానవత్వం కొద్దిగా తొంగి .

'క్షమించండి ! చౌదరిగారూ ! మీ దగ్గర నేను ఉచితంగా తీసికోలేను' అన్నాడు మాష్టరుగారు.

అదేంటండి అలా అంటారు. యిది ఉచితం కాదు. ప్రతిఫలం యింతకు చెప్పటం మర్చిపోయాను. మా అబ్బాయి మీ క్లాస్‌లోనే చదువుతున్నాడు. వాడికి కొద్దిగా లెక్కల్లో పూర్...మీరు....మీరు...

చౌదరిగారూ ! వెంకట్రావు మాష్టరుగారి కంఠం ఉద్వేగంతో పలికింది.

'మీరు పొరబడ్డారు ఊళ్లో పెద్దమనుష్యులు అన్యాయాన్ని మీరు ప్రోత్సహిస్తున్నారు...'

చౌదరి ముఖం అవమానంతో కందగడ్డలా అయింది '...పెద్దవారు ఒకరికి చెప్పవలసినవారు...' మాష్టరుగారి కంఠం మెల్లగా పలికింది

...............

చౌదరి కోపంతో బయటికి నడిచాడు.

◆ ◆ ◆

పోస్ట్ !

'మాష్టరుగారు మీకు రిజిష్టరు లెటర్' సంతకం చేసి తీసికున్నాడు ఉత్తరాన్ని మాష్టరుగారు

'...ధర్మయ్య తన అప్పు తీర్చమని తీరపోతే కోర్టుకు వెడతానని రిజిష్టరు నోటీసు యిచ్చాడు.

అది చూసి మాష్టరుగారి ముఖం వాడిపోయింది.

అప్పు మొత్తం వడ్డీతో యిరవై నాలుగు వందలయింది.

మాష్టరుగారి మనసు దుఃఖమయ మయింది.

'యిది ఆ చౌదరే చేసుంటాడు...'

యెల్లుండి సంక్రాంతి, రేపు అల్లుడు కూతురు వస్తారు. డబ్బు యెలాగ.

నలుగురిముందు అవమానం పొందాలని వ్రాసి ఉందేమో ? ధర్మయ్య అప్పు...... యిప్పుడు తను అప్పు యెలా తీర్చగలడు అప్పు తీర్చకపోతే పోలీసులు....డబ్బు ... సులు...కోర్టు...జైలు.

యివి తలుచుకునే టప్పటికి ఆయన భయంతో వణికిపోయాడు. శరీరం అంతా చమటు పట్టింది

అర్ధరాత్రిదాకా ఏదో ఆలోచనలలో నిద్ర పట్టలేదు. అర్ధరాత్రి దాటాక కొద్దిగా నిద్ర పట్టింది

.............

టెలిగ్రాం ! పోస్ట్‌మాన్ టెలిగ్రాం తెచ్చాడు ఉదయం ఏడుగంటలకు.

వెంకట్రావుగారి పెద్దకొడుకు రామం టెలిగ్రాం తీసికొని ఒక్కసారి అదిరిపడ్డాడు. ఆనందంతో అమ్మా !, అమ్మా ! అంటూ వంటింట్లోకి పరుగెత్తాడు. అమ్మా 'నాన్నగారికి లాటరీలో లక్షరూపాయలు వచ్చినాయ్'

ఆ వార్తకు పార్వతమ్మ సముద్రంలో కెరటం లేచినంత యెత్తు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

రామం ఆ వార్త నిద్రపోతున్న తండ్రికి తెలుపాలని తండ్రి గదిలోకి పరిగెత్తాడు.

ఆ వార్త వెంకట్రావు గారికి చేరలేదు.

అర్ధరాత్రిదాకా ఆలోచనలలో ఉద్వేగపడిన మాష్టరుగారికి తెలవారుజామున గుండె పోటు యెక్కువై బాధతో యీ లోకాన్ని శాశ్వతంగా వదిలాడు.

---

# నవ భారతి

—తిరునగరి

నవభారతసీమ నాది
యువభారత నేతనేను
ఆ సేతు హిమాచలమ్ము
నా సామ్రాజ్యమ్మే సుమ్ము
గంగానది గల,గల మని
కృష్ణవేణి కిల కిల మని
గోదావరి జల,జల మని
కావేరీ కల,కల మని
అనారతము సాగునట్టి
అతిపవిత్రభూమి నాది

ఇంకెంటికి వాసమైన
చక్కని హిమ పర్వతమ్ము
మునులందరు తపసుఁ జేసి
ముక్తి పొందు భూధరమ్ము
మంచుకొండ నా భారతి
సిగలోపలి మల్లెదండ
పగవానిని తరిమి, తరిమి
తెగవేసిన వీరత్వము
శరణు వేడు రిపునైనను
దరి జేర్చెడి కారుణ్యము
నాలికించెడి గుండె నాది
కవితలల్లు కరము నాది

నా భారతి వీరమాత
నేను భరత జాతినేత
నా భారతి ప్రేమమూర్తి
నేను భరత చక్రవర్తి
భరతమాత పాదాలకు
పాలిల్లుడు ప్రతిదినమ్ము
నా సోదర భరతపుత్ర
రాసలుపగ వందనమ్ము
నవభారత సీమనాది
యువ భారత నేత నేను.